క్లుప్తంగా

గంగమ్మ ఆలయానికి హుండీ వితరణ


వితరణ చేసిన హుండీ

పుత్తూరు: స్థానిక బజారు వీధిలో వెలసిన పిడికిలి గంగమ్మ ఆలయానికి వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ రాజేశ్వరి, మునిరత్నం దంపతులు మంగళవారం స్టీల్ హుండీని వితరణగా అందజేశారు. గత శనివారం హుండీ చోరీకి గురైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో పట్టణానికే చెందిన రామకుమార్‌శెట్టి మూడు తాళాలను వితరణగా అందజేశారు.

ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు


సర్వే నిర్వహిస్తున్న అధికారులు

నగరి : మండలంలో ప్రత్యేక అవసరాలు పిల్లలను గుర్తించడం కోసం జిల్లా ప్రత్యేక అవసరాల అధికారి ప్రభాకర్ వర్మ సర్వేను నిర్వహించారు. మంగళవారం కాకవేడు దళితవాడలో సర్వే చేపట్టారు. ఈ సర్వే జూన్ 9వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. గుర్తించిన వారిని స్థానిక భవిత కేంద్రంలో చేర్చి వారికి విద్యతో పాటు వైద్యసంబంధిత సహకారం అందిస్తామన్నారు. ఈ సర్వేలో భవిత సిబ్బంది భవాని, సంతోష్ నాయక్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాటగంగమ్మకు ప్రత్యేక పూజలు


ఆలయం వద్ద కోలాట ప్రదర్శన


పుష్పాలంకరణలో బాటగంగమ్మ

పాలసముద్రం : మండలంలోని వెంగళరాజుకుప్పం పంచాయతీ కన్నికాపురంలో ఉన్న బాట గంగమ్మకు కొలువు మహోత్సవంలో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఉదయం అమ్మవారి గెరిగెను పూలతో అలంకరించి గ్రామాల్లో ఊరేగించారు. మధ్యాహ్నం అమ్మవారికి అభిషేకాలు, విశేషాలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారి ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన కోలాట ప్రదర్శన భక్తులను ఆకట్టుకొంది. సాయంత్రం అమ్మవారికి పాలు, చందనం, పసుపు నీటితో అభిషేకాలు చేశారు. విశేషాలంకరణ చేసి, ప్రత్యేక దీపారాధన, పూజలు చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. రాత్రి వీధినాటకం ప్రదర్శన ఏర్పాటు చేశారు. కాగా బుధవారం అమ్మవారి పుష్పపల్లకి సేవ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అలజడి సృష్టిస్తే కఠిన చర్యలు

శ్రీరంగరాజపురం : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ రోజున గ్రామాల్లో అలజడులు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఆర్ పురం ఎస్‌ఐ రాజకుల్లాయప్ప హెచ్చరించారు. మండలంలో సమస్యాత్మక ప్రాంతాలైన పుల్లూరు, కొత్తపల్లి మిట్ట గ్రామాల్లో గస్తీ నిర్వహిస్తున్నామన్నారు. కౌంటింగ్ రోజున పోలీస్ సిబ్బంది మూడు బృందాలుగా ఎస్ ఆర్ పురం, ముద్దికుప్పం కొత్తపల్లిమిట్ట మార్గాల్లో మొబైల్ వాహనాల ద్వారా గస్తీ నిర్వహిస్తామన్నారు. పల్లెల్లో ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు.

మము పాలింపగా వచ్చితివా..


రథంపై స్వామివారి విహారం

నారాయణవనం : మండల కేంద్రంలో కల్యాణ వేంకటేశ్వరస్వామి రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. రంగుల వస్త్రాలు, ప్రతిమలతో సుందరంగా అలంకరించిన రథంపై శ్రీదేవి, భూదేవి సమేతంగా విశేషంగా ముస్తాబైన శ్రీస్వామివార రథ విహారం చేస్తూ భక్తులను అనుగ్రహించారు. వేకువ జామున 3.45 గంటలకు సుప్రభాతసేవతో ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్యపూజా కార్యక్రమాలను నిర్వహించారు. 5.30 గంటలకు దేవరులతో కలిసి వేంకటేశ్వరస్వామి తిరుచ్చి వాహనంలో రథ మండపానికి వేంచేపు చేశారు. ప్రత్యేక పూజలు అనంతరం ఉత్సవర్లు 7 గంటలకు రథాన్ని అధిరోహించారు. భక్తుల గోవింద నామస్మరణల మధ్య వీధుల్లో వివహరిస్తూ 11 గంటలకు రథం గంగుంద్ర మండపం వద్దకు చేరుకుంది. మళ్లీ 2 గంటలకు ప్రారంభమై రథం 4 గంటలకు గమ్యస్థానానికి చేరుకుంది. శ్రీపద్మావతీ అమ్మవారి స్వర్ణాభరణాలను అపహరించిన తిరుమంగై ఆళ్వార్‌ను వెంటాడి విడిపించిన ఘట్టం భక్తులను కనువిందు చేసింది.

వేసవి శిక్షణ.. అనూహ్య స్పందన


పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు


క్యారమ్స్ ఆడుతున్న విద్యార్థులు


- గ్రంథాలయాల్లో ఆడిస్తూ.. పాడిస్తూ.. బోధన
- ఉత్సాహంగా పాల్గొంటున్న విద్యార్థులు

పుత్తూరు: గ్రంథాలయాల్లో వేసవి శిక్షణా తరగతులకు అనూహ్య స్పందన వస్తోంది. ప్రస్తుత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన గ్రంథాలయాల్లో సమ్మర్ క్యాంప్‌ను విద్యార్థులు చక్కగా సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇందుకు తల్లిదండ్రుల ప్రోత్సాహం సైతం ఎంతగానో దోహదపడుతోంది. గ్రంథాలయాలు కేవలం పుస్తక పఠనానికి మాత్రమే పరిమితం కాకుండా ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా విజ్ఞాన, వ్యక్తిత్వ వికాస కేంద్రాలుగా రూపొందుతున్నాయి. ఇందులో భాగంగానే విద్యార్థులకు పలు అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణా తరగతులు అన్ని గ్రంథాలయాల్లో వాస్తవానికి ఏప్రిల్ 29న ప్రారంభం కావలసి ఉండగా, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మే 15 నుంచి ప్రారంభం కాగా జూన్ 7వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి 11.30 గంటల వరకు నిర్వహిస్తున్న ఈ విజ్ఞాన తరగతులు వినడానికి విద్యార్థులు ఉత్సాహంగా వస్తున్నారు. ముఖ్యంగా పిల్లలకు విజ్ఞానం పెంపొందించేలా, మానసిక వికాసానికి సంబంధించిన ఆటపాటలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు ఇంగ్లిషు గ్రామర్, లెక్కలు, అబాకస్, క్రాఫ్ కటింగ్, చదరంగం, క్యారమ్స్, డ్రాయింగ్ వంటి అంశాల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు కథలు చెప్పిడం, పిల్లల చేత చెప్పించడం, పుస్తక పఠనం చేయిస్తున్నారు. ఒక్కో గ్రంథాలయంలో కనీసం 30 మంది నుంచి 60 మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. ప్రజాప్రతినిధులు, విశ్రాంత ఉద్యోగులను పిలిపించి వారి అనుభవాలను పిల్లలకు వివరించే చర్యలు చేపట్టారు. రచయితలు, డ్రాయింగ్ మాస్టర్లచే శిక్షణ ఇప్పిస్తున్నారు. శిక్షణా తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు బహుకరించనున్నారు.

శిక్షణ నిర్వహణ ఇలా..

- ఉదయం 8 గంటల నుంచి 8.30 వరకు కథలు చెప్పించడం
- 8.30 నుంచి 9 గంటల వరకు పుస్తక పఠనం
- 9 నుంచి 9.30 గంటల వరకు డ్రాయింగ్
- 9.30 నుంచి 10 గంటల వరకు స్పోకెన్ ఇంగ్లిష్
- 10 నుంచి 10.30 గంటల వరకు విరామం
- 10.30 నుంచి 11 గంటల వరకు కథలు చెప్పడం
- 11 గంటల నుంచి 11.30 వరకు అతిథులతో స్ఫూర్తిదాయక ప్రసంగాలు

పిల్లలను ప్రోత్సహించాలి



వేసవి సెలవుల నేపథ్యంలో గ్రంథాలయాల్లో ఇస్తున్న శిక్షణా తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. ఇందుకు తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించాలి. పిల్లలు తమ ప్రజ్ఞాపాటవాలను పెంపొందించుకునేందుకు ఈ శిబిరాలు ఎంతగానో ఉపయోగపడుతాయి. విజేతలకు బహుమతులను అందజేస్తున్నాము.

– కె.మీనాకుమారి, గ్రంథాలయాధికారి, పుత్తూరు

వృద్ధులకు చీరలు, పంచెల వితరణ


వృద్ధులకు పండ్లు, స్వీట్లు వితరణ చేస్తున్న ఇందిర కుటుంబ సభ్యులు

కార్వేటినగరం: పుత్తూరు పట్టణానికి చెందిన ఇందిర నాలుగో వర్ధంతి సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులు మంగళవారం కార్వేటినగరంలోని వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పంచెలు, టవళ్లు, చీరలు వితరణ చేశారు. అలాగే మధ్యాహ్నం వృద్ధులకు స్వీట్లు, పండ్ల పంపిణీ చేశారు. అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇందిర కుటుంబ సభ్యులు జయచంద్ర, భీమారావు, సాంబశివ, వెంకీ, ఉషారాణి, లక్ష్మీపతి, చిన్న గుర్రప్ప, నాగరాజు, సోము, గోవిందరాజులు, రమణ, లోక పాల్గొన్నారు.

నేటి నుంచి చండీసప్తశతి హోమపూజలు

నగరి : మండలంలోని బుగ్గ అగ్రహారం శ్రీ వన్నూరమ్మ ఆలయంలో చండీసప్తశతి హోమపూజలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. బ్రహ్మశ్రీ తిప్పావఝల శ్రీకాంత్‌శర్మ, నిభణపూడి ఉదయకుమార్ శర్మ, పురాణం దుర్గాప్రసాద్ శర్మ, నవీన్‌కుమార్ శర్మ, మహేశ్ శర్మ ఈ పూజలను నిర్వహిస్తారని ఆలయ ధర్మకర్త పూజారి వెంకటరెడ్డి తెలిపారు.

నాడు-నేడు ఫేజ్-2 పనులు పూర్తి చేయండి


మాట్లాడుతున్న ఎంఈఓ తిరుమలరాజు

పుత్తూరు: పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి నాడు–నేడు ఫేజ్–2లో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని ఎంఈఓలు తిరుమలరాజు, బాలసుబ్రమణ్యం అధికారులను ఆదేశించారు. స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో హెచ్‌ఎంలకు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లుకు, సీఆర్‌ఎంటీలతో సమావేశం నిర్వహించారు. తిరుమలరాజు మాట్లాడుతూ వేసవి సెలవులు ముగిసి పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. పాఠశాలల్లో మేజర్, మైనర్ మరమ్మతులతో పాటు, ఎలక్ట్రీషియన్, టాయిలెట్స్ విత్ రన్నింగ్ వాటర్, తాగునీరు, వంటశాలల సౌకర్యాలన్నింటినీ ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఈనెల 30వ తేదీన పాఠశాలల్లో వంట చేసే వర్కర్లకు ఎగువకనకంపాళెం మండల పరిషత్ పాఠశాలలో ఒకరోజు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ తరగతులకు ప్రతి పాఠశాల నుంచి ఒక్కో వంట మనిషి విధిగా హాజరు కావాలని స్పష్టం చేశారు. అలాగే హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తమ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ పెంచడానికి కృషి చేయాలని సూచించారు. విద్యాకానుక కిట్లను సైతం పాఠశాల ప్రారంభమయ్యే తొలిరోజే విద్యార్థులకు అందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

వైభవంగా కల్యాణోత్సవం


భద్రావతి, భావనారుషీశ్వరుల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

పుత్తూరు: మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో వెలసిన శ్రీరుక్మిణీ సమేత శ్రీకృష్ణ స్వామి దేవస్థానంలో మంగళవారం శ్రీభద్రావతి సమేత శ్రీభావనారుషీశ్వర స్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, అర్చనలు, హారతులు నిర్వహించారు. అనంతరం పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి వధూవరులుగా తీర్చిదిద్దారు. తొలుత కలశ ప్రతిష్ఠ చేసి, వినాయక పూజ, పలు వైదిక క్రతువులను శాస్త్రోక్తంగా పూర్తి చేశారు. శ్రీభావనారుషీశ్వర స్వామి ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విశేష సంఖ్యలో భక్తులు పాల్గొనగా, వేదపండితులు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు శిక్షణ


మధ్యాహ్న భోజన కార్మికులకు శిక్షణ ఇస్తున్న ఎంఈఓ ఆంజనేయులు శెట్టి


పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తున్న అధికారులు

గంగాధర నెల్లూరు: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన తయారీ కార్మికులకు మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీపీ స్కూల్‌లో శిక్షణ తరగతులు నిర్వహిచారు. ఎంఈఓ ఆంజనేయులు శెట్టి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణలో మధ్యాహ్నం భోజన నిర్వహణ, పరిశుభ్రత, రోజువారీ మెనూ తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చారు. అలాగే మధ్యాహ్నం అన్ని పాఠశాలలకు చెందిన వంట కార్మికులకు రోజువారి మెనూపై పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ శ్రీదేవి, ఉపాధ్యాయులు ఢిల్లీ ప్రకాష్, గంగాధర్, రెడ్డమ్మ, సిబ్బంది ప్రసాద్, పూర్ణ, కుమారి పాల్గొన్నారు.

వేడుకగా గొల్లగంగమ్మ కొలుపు


అమ్మవారికి మొక్కుకుంటున్న భక్తులు

పాలసముద్రం: మండలంలోని ఆముదాల పంచాయతీ గొల్లకండ్రిగలో గొల్ల గంగమ్మ కొలుపు మంగళవారం కోలాహలంగా జరుపుకున్నారు. ఉదయం అమ్మవారికి పాలు, తేనె, నెయ్యి, చందనం, పెరుగుతో అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారి ఆలయం ఎదుట రంగవల్లులు తీర్చిదిద్దారు. ముగ్గులపై సంతానం లేని మహిళలు కర్పూరం వెలిగించి మొక్కుకున్నారు. మధ్యాహ్నం గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి మహిళలు పొంగళ్ల సామగ్రిని పంబ వాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల నడుమ ఊరేగింపుగా అమ్మవారి ఆలయ ప్రాంగణానికి చేరకుని, పొంగళ్లు పెట్టి, అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. సాయంత్రం ఆలయ ధర్మకర్త బి.నాగరాజ్, కొలుపు ఉభయకర్తలు మార్కొండేయులు కుటుంబ సభ్యులు బెంగళూరు నుంచి తీసుకొచ్చిన సుగంధభరిత పుష్పాలు, పూజాసామగ్రిని నయాండి వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. ఆలయ అర్చకులు ఉభయకర్తలు తీసుకొచ్చిన పుష్పాలతో అమ్మవారిని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు పంచామృతం, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కొలుపు తిలకించడానికి కర్ణాటక, తమిళనాడు, మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.




పొంగళ్ల సామగ్రి ఊరేగింపులో మహిళలు, (ఇన్‌సెట్) విశేషాలంకరణలో అమ్మవారు

వాడవాడలా వైభవంగా జాతర


కార్వేటినగరం: అలంకరణలో పాదిరికుప్పం నడివీధి గంగమ్మ


శ్రీరంగరాజపురం: విశేష అలంకరణలో గంగమ్మ


గంగాధరనెల్లూరు: తూగుండ్రంలో ప్రత్యేక అలంకరణలో గంగమ్మ


కార్వేటినగరం: నిప్పలపోలాక్షమ్మ ఆలయం వద్ద నుంచి జ్యోతిని తీసుకొస్తున్న భక్తులు


శ్రీరంగరాజపురం: ఆలయ ఆవరణలో పొంగళ్లు వండుతున్న భక్తులు

కార్వేటినగరం: గంగాధర నెల్లూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో మంగళవారం గంగమ్మ జాతరలు వైభవంగా నిర్వహించారు. కార్వేటినగరం మండలంలోని పాదిరికుప్పంలో మంగళవారం ఉధయం నుంచి నడివీధి గంగమ్మ జాతర వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా గ్రామంలోని వీధులన్నీ వేపాకు తోరణాలతో అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం ప్రత్యేక వాయిద్యాల నడుమ మహిళలు అంబలిని ఊరేగింపుగా తీసుకువచ్చి, గంగమ్మకు నైవేద్యం పెట్టారు. అనంతరం అంబలిని భక్తులకు పంపిణీ చేశారు. సాయంత్రం గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలోని నిప్పలపోలాక్షమ్మ ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి, పిండి దీపాలు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. నిప్పలపోలాక్షమ్మ ఆలయం వద్ద నుంచి జ్యోతిని ఊరేగింపుగా తీసుకువచ్చి గ్రామంలోని నడివీధి గంగమ్మ ఆలయంలో ప్రతిష్ఠించారు. అనంతరం అమ్మవారిని పట్టు వస్త్రాలు, సుగంధభరిత పుష్పాలు, విశేష అభరణాలతో అలంకరించి ప్రత్యేక వాహనంపై కొలువు దీర్చి రజకుల చేతుల మీదుగా మొదటి హారతి ఇచ్చారు. ఆ తరువాత గంగమ్మను పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులిచ్చి, మొక్కులు తీర్చుకున్నారు. ఊరేగింపు సందర్భంగా బాణసంచా వేడుకలు భక్తులను ఆకట్టుకున్నాయి. అలాగే కార్వేటినగరం పెద్ద దళితవాడ, ఈడిగపల్లె, టీకేఎం పేట, గ్రామాల్లో కూడా గంగమ్మకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి, అమ్మవారిని ఊరేగించారు.

ఘనంగా గంగమ్మ జాతర

శ్రీరంగరాజపురం : మండలంలోని మత్రిపల్లెలో గంగమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. జాతరకు జనం పోటెత్తారు. తొలిపూజను కనులారా తిలికించారు. అమ్మవారికి అంబలి, పిండివంటలు నైవేద్యం సమర్పించారు. గంగమ్మ వేషధారణలు వేసి, మొక్కులు తీర్చుకున్నారు. తొలుత డప్పు వాయుద్యాలు నడుమ గంగమ్మను నడి వీధిలో కొలువు దీర్చి, మమ్ము కటాక్షించమ్మా అని వేడుకున్నారు. అనంతరం భక్తులు అమ్మవారి ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. వంశపారంపర్య ధర్మకర్త తిరుమల, ఉమాపతి చేతులు మీదుగా తొలి పూజ చేసి జాతర ఘట్టాన్ని ప్రారంభించారు.

తూగుండ్రంలో..

గంగాధర నెల్లూరు: మండలంలోని తూగుండ్రం గ్రామంలో గంగమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి అంబళ్లను వాయిద్యాలు నడుమ తీసుకువచ్చి గంగమ్మ ఆలయం వద్ద ఉంచిన డ్రమ్ములో పోసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గెరిగెను వీధుల్లో ఊరేగించారు. భక్తులు గంగమ్మకు కుంభకూడు వేసి మొక్కులు తీర్చుకున్నారు కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రామస్వామిశేఖర్ మొదలియార్ పాల్గొన్నారు.


కార్వేటినగరం: ఆలయం వద్ద పొంగళ్లు వండుతున్న మహిళలు


శ్రీరంగరాజపురం: అమ్మవారి దర్శనానికి ట్రాక్టర్‌లో వస్తున్న భక్తులు

రైల్వేపోలీసుల దందా..


పుత్తూరు రైల్వేస్టేషన్‌లో మోటార్ సైకిళ్లకు చైన్‌తో తాళాలు వేసిన రైల్వే పోలీసులు

- నో పార్కింగ్ పేరిట పుత్తూరు రైల్వేస్టేషన్‌లో దోపిడీ
- రశీదు అడిగితే కేసు నమోదు చేస్తామని బెదిరింపులు
- గగ్గోలు పెడుతున్న వాహన చోదకులు

పుత్తూరు: స్థానిక రైల్వేస్టేషన్‌లో విజిటర్స్ నుంచి నో పార్కింగ్ పేరిట రైల్వే పోలీసులు దోపిడీకి పాల్పడుతున్నారు. ఫైన్ కడుతాము రశీదు ఇవ్వండని అడిగితే, అయితే కేసు కడుతున్నాం కోర్టుకు రావాలంటూ వేధింపులకు గురిచేస్తున్నారని విజిటర్స్ వాపోతున్నారు. మంగళవారం నాలుగు మోటార్ సైకిళ్లకు చైన్ ద్వారా తాళాలు వేసిన పోలీసులు వాహనదారులు ఒక్కొక్కరి నుంచి రూ.500 ఫైన్ కట్టాలంటూ ఆదేశించారు. పుత్తూరు మండలం పరమేశ్వరమంగళం గ్రామానికి చెందిన బి.కిరణ్‌కుమార్ ఏపీ03 ఏపీ4145 నంబర్ గల తన మోటర్ సైకిల్‌కు రూ.500 ఫైన్ కట్టేందుకు సిద్ధపడి, రశీదు ఇవ్వాల్సిందిగా కోరాడు. దీంతో ఆగ్రహించిన ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ అయితే కోర్టుకు వచ్చి కట్టు అంటూ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు కిరణ్‌కుమార్ వెల్లడించారు. అలాగే కోర్టులోనే ఫైన్ కడుతానని కిరణ్‌కుమార్ మోటర్ సైకిల్‌ను అక్కడే వదలిపెట్టి ఇంటి ముఖం పట్టాడు. ఇదీ ప్రతిరోజూ జరుగుతున్న తంతుగా విజిటర్స్ ఆరోపిస్తున్నారు.

టికెట్ తీసుకోవడానికో లేక స్టేషన్‌లో తమ వారిని దింపడానికో వచ్చిన విజిటర్స్ మహా అంటే ఓ అరగంట పాటు మోటార్ సైకిల్‌ను స్టేషన్ ముందు పార్క్ చేస్తారు. ఆ సమయంలోనే వాహనాలకు తాళాలు వేసి రూ.500 ఫైన్ కట్టమనడం దారుణమని ప్రజలు విమర్శిస్తున్నారు. ఫైన్ కడతామన్న వాహనదారుడికి రశీదు ఎందుకు ఇవ్వరో రైల్వే పోలీసులు సమాధానం చెప్పాలని విజిటర్స్ డిమాండ్ చేస్తున్నారు. నో పార్కింగ్ పేరిట దోపిడీ చేస్తున్న స్థానిక రైల్వే పోలీసులపై ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని విజిటర్స్ డిమాండ్ చేస్తున్నారు. అదే వారి (పోలీస్) మోటార్ సైకిళ్లను మాత్రం నేరుగా రైల్వే ప్లాట్‌ఫామ్‌పై పార్క్ చేస్తున్నారని, ఇందుకు మాత్రం ఏ చట్టం అనుమతిస్తోందో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.


రైల్వే ప్లాట్‌ఫాంపై పార్క్ చేసిన పోలీస్ మోటార్‌సైకిల్